


# కుస్తీమే సవాల్

**దేశ రాజధానిలో యువ రెజ్లర్ల నిరసన**


**బజరంగ్, వినేశ్, సాక్షికి వ్యతిరేకంగా ప్రదర్శన**

న్యూఢిల్లీ: కుస్తీ యోధుల పోరాటం అనుకోని మలుపు తిరిగింది. ఇన్ని రోజులు మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా నిరసన జరుగగా, తాజాగా తమ రెజ్లింగ్ కెరీర్లను కోల్పోతున్నామంటూ వందల మంది యువ రెజ్లర్లు పోరుబాట పట్టారు. ఏడాది కాలంగా నిరసన చేస్తున్న బజరంగ్ పునియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌కు వ్యతిరేకంగా దాదాపు 300 మంది యువ రెజ్లర్లు బుధవారం జంతర్‌మంతర్ దగ్గర భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ అకాడాల నుంచి చలిని సైతం లెక్కచేయకుండా జంతర్‌మంతర్ వద్దకు చేరుకున్నారు. గతేడాది ఇదే సమయంలో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ నిరసన చేసి చోటే యువ రెజ్లర్లు ప్లకార్డులతో నినాదాలు చేశారు. స్టార్ రెజ్లర్ల నిరసన కారణంగా ఏడాది కాలంగా షెడ్యూల్‌కు అనుగుణంగా రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలు జరుగకపోవడం వలన తమ కెరీర్లకు ప్రతిబంధకంగా మారిందని తమ గళం విప్పారు. ఎంతో విలువైన తమ కెరీర్లు వీరి వల్ల నాశనం అవుతున్నాయంటూ ధ్వజమెత్తారు. పది రోజుల వ్యవధిలో జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ)ని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో తిరిగి ఢిల్లీ నడి వీధుల్లో పోరుబాట పడుతామని హెచ్చరికలు జారీచేశారు.

**చంపేస్తామంటూ బెదిరింపులు:** డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ అనుచరులు చంపేస్తామని బెదిరిస్తున్నారని సాక్షి మాలిక్ పేర్కొంది.

# మెరిసిన వ్రితి

**జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఢిల్లీ వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. పోటీలకు తొలి రోజైన బుధవారం జరిగిన బాలికల అండర్-19 800మీ ఫ్రీస్టయిల్ విభాగంలో బరిలోకి దిగిన వ్రితి 9:29:01సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. షిరిన్(ఐఎస్‌సీఈ), పాటిల్ డాలీ(మహారాష్ట్ర) వరుసగా రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు. మరోవైపు బాలుర 800మీ ఫ్రీస్టయిల్‌లో సోమ్‌దేవ్ టాప్‌లో నిలిచాడు.

## యోధాస్ ఘన విజయం

కటక్: అల్టిమేట్ ఖోఖో లీగ్‌లో తెలుగు యోధాస్ వరుస విజయాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 40-22తో ముంబై ఖిలాడీస్‌పై ఘన విజయం సాధించింది. మ్యాచ్ ఆద్యంతం పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన యోధాస్..ఈ సీజన్‌లో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. యోధాస్ తరపున ప్రతీక్ వైకర్, అవదూత్ పాటిల్, ఆదిత్య మెరుగైన ప్రదర్శన కనబరిచారు.

## కమిన్స్ పాంచ్ పటాకా

సిడ్నీ: ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య మూడో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. తన కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న డేవిడ్ వార్నర్ (6), ఖవాజ (0) బ్యాటింగ్‌తో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా ఆరు పరుగులు చేసింది. పాక్ స్కోరుకు ఆసీస్ ఇంకా 307 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులకు ఆలౌటైంది. కమిన్స్ (5/61) మరోమారు ఐదు వికెట్లతో విజృంభించాడు.

# సిరాజ్ 6/15

**ఆరు వికెట్లతో సంచలన ప్రదర్శన**

**దుమ్మురేపిన హైదరాబాదీ పేసర్**

**1** ఓవరాల్‌గా టెస్టుల్లో ఇప్పటి వరకు పరుగులు చేయకుండా ఆరు వికెట్లు కోల్పోవడం ఇదే తొలిసారి. ఈ చెత్త రికార్డును భారత్ తన పేరిట లిఖించుకుంది.



సిరాజ్ (6/15)

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 55 ఆలౌట్ • టెస్టుల్లో భారత్‌పై ఇదే అత్యల్పం**

**టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్ 153 ఆలౌట్ • 11 బంతుల తేడాతో ఆరు వికెట్లు**

## తొలి రోజు మొత్తం 23 వికెట్లు

సుదీర్ఘ(146 ఏండ్లు) టెస్టు క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయం. ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని సందర్భం. పేస్‌కు స్వర్గధామమైన కేప్‌టౌన్ పిచ్‌పై భారత్, దక్షిణాఫ్రికా పేసర్లు వికెట్ల వేట కొనసాగించారు. సఫారీలో జంతువులను వేటాడినట్లు పేసర్లు తమ విశ్వరూపం ప్రదర్శించారు. ఫలితంగా ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మొదటి రోజే లెక్కకు మిక్కిలి రికార్డులు బద్దలయ్యాయి.

తొలుత హైదరాబాదీ షాన్ మహమ్మద్ సిరాజ్ ఆరు వికెట్ల విజృంభణతో వికెట్ల వేటకు లైన్ వేశాడు. సూపర్ స్వింగ్ బౌలింగ్‌తో సఫారీ బ్యాటర్లకు పట్టపగలే చుక్కలు చూపిస్తూ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. మియాభాయ్‌కు తోడు బుమ్రా, ముకేశ్ తోడవ్వడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే కుప్పకూలింది. టెస్టుల్లో భారత్‌పై సఫారీలకు ఇదే అత్యల్ప స్కోరు.

కోహ్లీ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో సాఫీగా సాగుతున్న టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్ 11 బంతుల్లో ఆఖరి ఆరు వికెట్లు కోల్పోయింది. పరుగులేమి లేకుండానే వికెట్లు చేజార్చుకుని చెత్త రికార్డును తమ ఖాతాలో వేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన దక్షిణాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయి భారత స్కోరుకు 36 పరుగుల దూరంలో ఉంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్పా ఆట మూడో రోజుకు పోవడం అసాధ్యం అనిపిపిస్తున్నది.

కేప్‌టౌన్: కేప్‌టౌన్‌లో సఫారీల వేట! దక్షిణాఫ్రికా గడ్డపై భారత పేసర్లు దుమ్మురేపారు. తొలి టెస్టులో భారీ ఓటమి నుంచి అనూహ్యంగా పుంజుకున్న రోహిత్‌సేన..సఫారీలపై బెబ్బులిలా విరుచుకుపడింది. ఆకలిగొన్న పులిలా దొరికింది దొరికినట్లు నిర్దాక్షిణ్యంగా వేటాడింది. ఈ వేటకు మన హైదరాబాదీ యువ పేసర్ మహమ్మద్ సిరాజ్ నాయకత్వం వహిస్తే..బుమ్రా, ముకేశ్‌కుమార్ మిగతా పనిని పూర్తి చేశారు. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డీన్ ఎల్గర్ ఎవరూ ఊహించని రీతిలో బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పచ్చికతో కళకళలాడుతున్న పిచ్‌పై మన పేసర్లు ముఖ్యంగా సిరాజ్ నిప్పులు చెరిగాడు. ఇన్‌స్వింగ్, ఔట్‌స్వింగ్, ఫుల్, గుడ్ లెంగ్త్ బంతులతో సఫారీ బ్యాటింగ్ నడ్డివిరిచాడు. ఓపెనర్ మార్క్‌రమ్(2)తో మొదలైన సిరాజ్ వికెట్ల పర్వం ఆఖరి వరకు దిగ్విజయంగా కొనసాగింది. ఎంతలా అంటే లంచ్ విరామ సమయానికే సిరాజ్ తన ఖాతాలో ఐదు వికెట్లు వేసుకునేలా. 92 ఏండ్ల దేశ టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ ఫీట్ అందుకున్న బౌలర్‌గా సిరాజ్ నిలిచాడు. గత మ్యాచ్‌లో సెంచరీతో మ్యాచ్‌ను శాసించిన కెప్టెన్ ఎల్గర్(4)ను సిరాజ్ అద్భుత బంతితో బోల్తా కొట్టించాడు. ఆఫ్‌సైడ్ ఆఫ్‌స్టంప్ అవతల బంతిని ఎల్గర్ వికెట్ల మీదకు ఆడుకుని మూల్యం చెల్లించుకున్నాడు. ఆ తర్వాత టోనీ డీ జార్జి(2), బెడింగ్‌హామ్(12), జాన్సెన్(0), కైల్ వెరైన్(15)ను సిరాజ్ పెవిలియన్ పంపాడు. దీంతో తన టెస్టు కెరీర్‌లో తొలి సారి ఆరు వికెట్లు దక్కించుకున్నాడు. సిరాజ్, బుమ్రా, ముకేశ్ ధాటికి దక్షిణాఫ్రికా 23.2 ఓవర్లలో 55 పరుగులకు కుప్పకూలింది. నిషేధం పునరుద్ధరణ తర్వాత టెస్టుల్లో సఫారీలకు ఇదే అత్యల్ప స్కోరు కావడం విశేషం. బెడింగ్‌హామ్, వెరైన్ మినహా మిగతా బ్యాటర్లు అందరూ సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.

**11 బంతులు 6 వికెట్లు, 0 పరుగులు:** సఫారీలను స్వల్ప స్కోరుకు పరిమితం చేసిన భారత్ తమ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ప్రారంభించింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(0) డకౌట్‌గా వెనుదిరిగినా.. కెప్టెన్ రోహిత్‌శర్మ(39) ధాటిగా ఆడాడు. రోహిత్‌కు తోడు గిల్(36), విరాట్ కోహ్లీ(46) రాణించడంతో ఒక దశలో టీమ్ఇండియా మెరుగ్గా కనిపించింది. శ్రేయాస్ అయ్యర్ (0) నిరాశపరిచినా..కోహ్లీ, రాహుల్ ఇన్నింగ్స్‌ను కొనసాగించే ప్రయత్నం చేశారు. కానీ ఎంగ్డీ (3/30) రంగ ప్రవేశంతో సీన్ పూర్తిగా మారిపోయింది. తొలుత రాహుల్(8) అనవసరపు షాట్‌కు ఔట్ కాగా, ఆ తర్వాత జడేజా (0), బుమ్రా(0), కోహ్లీ, సిరాజ్ (0), ప్రసిద్ధ్ కృష్ణ(0) వరుస విరామాల్లో వికెట్లు సమర్పించుకున్నారు. అప్పటి వరకు 153/4 సాఫీగా కనిపించిన ఇన్నింగ్స్ 11 బంతుల వ్యవధిలో ఆఖరి ఆరు వికెట్లు కోల్పోయింది. పరుగులేమి లేకుండానే ఇన్ని వికెట్లు కోల్పోవడం టెస్టుల్లో ఇదే తొలిసారి.



ఎల్గర్ (4, 12)

**ఒకే రోజు 23 వికెట్లు**

153 పరుగులకు భారత్‌ను ఆలౌట్ చేసిన దక్షిణాఫ్రికా తొలి రోజే మరోమారు బ్యాటింగ్‌కు దిగింది. 98 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు మొదటి రోజు ఆట ముగిసే సరికి 3 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేశారు. ఓపెనర్ మార్క్‌రమ్(36), బెడింగ్‌హామ్(7) క్రీజులో ఉన్నారు. ముకేశ్‌కుమార్(2/25), బుమ్రా(1/25) రాణించారు. కెప్టెన్ డీన్ ఎల్గర్(12) తన ఇన్నింగ్స్‌లో ఆఖరి ఆట ఆడేశాడు. ముకేశ్ బౌలింగ్‌లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చేతిలో ఏడు వికెట్లు ఉన్న సఫారీలు ఇంకా 36 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నారు.

**1** 2011 తర్వాత టెస్టుల్లో తొలి సెషన్‌లో ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా సిరాజ్ నిలిచాడు. సిరాజ్ కంటే ముందు 1986-87లో పాకిస్థాన్‌పై బెంగళూరులో మణిందర్‌సింగ్ ఈ ఫీట్ నమోదు చేశాడు.

**దక్షిణాఫ్రికాలో భారత బౌలర్ల మెరుగైన ప్రదర్శన**

| | |
|---|---|
| శార్దూల్ ఠాకూర్ | (7/61)-2022 |
| హర్భజన్‌సింగ్ | (7/120)-2011 |
| సిరాజ్ | (6/15)-2024 |

**టెస్టుల్లో భారత్‌పై అత్యల్ప స్కోర్లు**

| | |
|---|---|
| దక్షిణాఫ్రికా | (55 ఆలౌట్)-2024 |
| న్యూజిలాండ్ | (62 ఆలౌట్)-2021 |
| దక్షిణాఫ్రికా | (79 ఆలౌట్)-2015 |

**సంక్షిప్త స్కోర్లు:** దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55 ఆలౌట్(వెరైన్ 15, సిరాజ్ 6/15), భారత్ తొలి ఇన్నింగ్స్: 153 ఆలౌట్(కోహ్లీ 46, ఎంగ్డీ 3/30), దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 62/3(మార్క్‌రమ్ 36 నాటౌట్, ముకేశ్ 2/25)

**వాణిజ్య**

## వాడుకలోలేని ఖాతాలపై మినిమం బ్యాలెన్స్ చార్జీలు వద్దు


- **బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశం**

ముంబై, జనవరి 3: రెండేండ్లకుపైగా ఎటువంటి లావాదేవీలు లేకుండా ఇన్‌ఆపరేటివ్‌గా ఉన్న ఖాతాలపై మినిమం బ్యాలెన్స్ లేదంటూ చార్జీలను వేయవద్దని బ్యాంకులను బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆదేశించింది. అలాగే స్కాలర్‌షిప్ నగదును పొందడం కోసం లేదా ప్రత్యక్ష నగదు బదిలీల కోసం తీసుకున్న ఖాతాల్లో రెండేండ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరుగకున్నా.. వాటిని ఇన్‌ఆపరేటివ్ ఖాతాలుగా పేర్కొనరాదనీ స్పష్టం చేసింది. అన్‌క్లెయిమ్డ్ బ్యాంక్ డిపాజిట్లను తగ్గించే చర్యల్లో భాగంగా, ఇన్‌ఆపరేటివ్ ఖాతాలపై విడుదల చేసిన తాజా సర్క్యులర్‌లో బ్యాంకులకు ఆర్బీఐ ఈ సూచనలు చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. 'బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను తగ్గించడానికి, సదరు డిపాజిట్లు వాటి నిజమైన హక్కుదారులు/యజమానులు/వారసులకు చేరడానికి బ్యాంకులు, ఆర్బీఐ ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలకు ఈ కొత్త మార్గదర్శకాలు కలిసొస్తాయని ఆశిస్తున్నాం' అని ఈ సందర్భంగా సర్క్యులర్‌లో ఆర్బీఐ పేర్కొన్నది.



- ఈ నూతన నిబంధనల ప్రకారం ఇన్‌ఆపరేటివ్‌గా మారుతున్న ఖాతాల సమాచారాన్ని వాటి నిర్వహణదారులకు ఎస్ఎంఎస్, లేఖలు, ఈమెయిల్ ద్వారా బ్యాంకులు తెలియపర్చాల్సి ఉంటుంది.
- ఒకవేళ ఖాతాదారుడు స్పందించకపోతే బ్యాంక్‌కు తొలుత ఆ ఖాతాదారున్ని పరిచయం చేసిన వ్యక్తిని గానీ, ఖాతాదారు నామినీనిగానీ బ్యాంక్ సంప్రదించాలని రూల్స్ చెప్తున్నాయి.
- వాడుకలోలేని ఖాతాలను తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు సదరు ఖాతాదారుల నుంచి బ్యాంకులు ఎలాంటి చార్జీలను వసూలు చేయరాదు.

## అధిక పెన్షన్‌కు మే 31 వరకూ గడువు



న్యూఢిల్లీ, జనవరి 3: అధిక పెన్షన్‌ను ఎంచుకునే ఉద్యోగుల వేతన వివరాల్ని యాజమాన్యాలు అప్‌లోడ్ చేయడానికి ఈపీఎఫ్‌వో మే 31వరకూ గడువు పొడిగించింది. గతంలో ఇచ్చిన ఈ గడువు డిసెంబర్ 31తో ముగియడంతో మరోసారి పెంచినట్టు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. అధిక పెన్షన్‌కు అర్హులైన ఈపీఎఫ్‌వో పెన్షనర్లు/సభ్యులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సదుపాయాన్ని 2023 ఫిబ్రవరి 26న సంస్థ ప్రారంభించింది. ఉద్యోగుల దరఖాస్తులకు పలుదఫాలు పెంచిన గడువు జూలై 11తో ముగిసింది. ఈ సమయానికి 17.49 లక్షల దరఖాస్తులు ఈపీఎఫ్‌వోకు అందాయి. అధిక పెన్షన్ కోసం ఆప్షన్/ఉమ్మడి ఆప్షన్ వ్యాలిడేట్ చేయడానికి దరఖాస్తులు సమర్పించే చివరితేదీని 2023 జూలై 11 వరకూ పొడిగిస్తున్నట్టు వెల్లడించింది. దరఖాస్తుదారుల వేతన వివరాల్ని అప్‌లోడ్ చేయడానికి యాజమాన్యాలు, యాజమాన్యాల అసోసియేషన్లు గడువు పెంచాలన్న వినతి మేరకు తొలుత సెప్టెంబర్ 30, అటుతర్వాత డిసెంబర్ 31 వరకూ పొడిగించింది. ఇంకా యాజమాన్యాల వద్ద 3.6 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని యాజమాన్యాలు ప్రాసెస్ చేసేందుకు ఈపీఎఫ్‌వో ట్రస్టీల బోర్డు చైర్మన్ గడువు పెంచినట్టు మంత్రిత్వ శాఖ వివరించింది.

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

ముంబై, జనవరి 3: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనుకావడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు సూచీలను మరింత నష్టాల్లోకి నెట్టాయి. ఒక దశలో 600 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 535.88 పాయింట్లు కోల్పోయి 71,356.60 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ 148.45 పాయింట్లు తగ్గి 21,517.35 వద్ద స్థిరపడింది. అమెరికా ఫెడ్ మీటింగ్ మినిట్స్‌తోపాటు దేశీయ పీఎంఐ ఇండెక్స్ సూచీ ఏడాదిన్నర కనిష్ఠానికి పడిపోవడంతో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా దేశీయ ఐటీ, బ్యాంకింగ్ షేర్లతోపాటు మెటల్, కమోడిటీ షేర్లు పతనాన్ని నమోదు చేసుకున్నాయి.



# తయారీరంగం మందగమనం

**18 నెలల కనిష్ఠానికి పీఎంఐ**

న్యూఢిల్లీ, జనవరి 3: భారత్‌లో తయారీ రంగ వృద్ధి నెమ్మదించవచ్చన్న సంకేతాలు వెల్లడవుతున్నాయి. వచ్చే కొద్ది నెలలో ఈ రంగం వృద్ధి మందగిస్తుందన్న అంచనాలను తాజా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. స్వల్ప, మధ్యకాలాల్లో తయారీ రంగానికి ఆర్డర్లు ఇచ్చే మేనేజర్లు, ఉత్పత్తికి అవసరమైన సరఫరాలు జరిపే మేనేజర్లను సర్వే చేసి ఈ ఇండెక్స్‌ను రూపొందించారు. భారత్‌కు సంబంధించి ఎస్ అండ్ పీ గ్లోబల్ నిర్వహించిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పీఎంఐ డిసెంబర్ సర్వే బుధవారం విడుదలయ్యింది. ఈ సర్వేను అనుసరించి డిసెంబర్‌లో మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ 54.9 స్థాయికి తగ్గింది. ఇది 18 నెలల కనిష్ఠస్థాయి. నవంబర్ నెలలో పీఎంఐ 56గా నమోదయ్యింది. అయితే 50 శాతానికి ఎగువన ఉన్న పీఎంఐ.. రంగం వృద్ధిని, 50 లోపు ఉంటే రంగం క్షీణతను సూచిస్తుంది. అంటే భారత్ తయారీ రంగం వృద్ధిబాటలోనే ఉన్నప్పటికీ, వృద్ధి వేగం మందగించినట్టు పీఎంఐ వెల్లడిస్తున్నది. దాదాపు 400 తయారీదార్ల ప్యానల్‌లో ఉన్న పర్చేజింగ్ మేనేజర్లకు పంపించిన ప్రశ్నావళికి అందిన స్పందనలను ఎస్అండ్‌పీ గ్లోబల్ క్రోడీకరించి హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పీఎంఐని లెక్కిస్తుంది. భారత్ తయారీ రంగం వృద్ధి డిసెంబర్‌లో సైతం కొనసాగిందని, కానీ కాస్త నెమ్మదించిందని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ఎకానమిస్ట్ ప్రంజుల్ భండారీ చెప్పారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి..రెండింటి వృద్ధి మందగించిందని తెలిపారు.

**ఉత్పత్తిదారుల విశ్వాసం**

పర్చేజింగ్ మేనేజర్ల సర్వే వృద్ధి వేగం తగ్గినట్టు సంకేతాలిస్తున్నప్పటికీ, తయారీదారులు మాత్రం వచ్చే మూడు నెలల్లో ఉత్పత్తి జోరుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలకు అనుగుణంగా కొత్త ఎంక్వయిరీలు వస్తున్నందున తయారీదారుల వాణిజ్య విశ్వాసం పుంజుకున్నదని హెచ్‌ఎస్‌బీసీ సర్వే పేర్కొంది. ద్రవ్యోల్బణం తొమ్మిదినెలల కనిష్ఠానికి తగ్గిన నేపథ్యంలో తయారీ రంగానికి అవసరమయ్యే ముడి వ్యయాల పెరుగుదల రేటు సైతం డిసెంబర్‌లో తక్కువగా నమోదయ్యింది.

# హైదరాబాద్ ఆఫీస్ భళా

**గత ఏడాది కార్యాలయ స్థల లీజింగ్ వృద్ధిలో రెండోస్థానం**

**మార్కెట్‌లో కీలకంగా మారుతున్న జీసీసీలు**

**నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక**



హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రధాన నగరాల్లో 2023లో జరిగిన ఆఫీస్ స్పేస్ లీజింగ్ వృద్ధిలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నట్టు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా బుధవారం తెలిపింది. ఓ వెబినార్‌లో భారతీయ హౌజింగ్, ఆఫీస్ మార్కెట్‌పై విడుదల చేసిన తమ నివేదికలో కార్యాలయ స్థల విపణిలో గత ఏడాది గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) హవా స్పష్టంగా కనిపించినట్టు పేర్కొన్నది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక-రాజకీయ ఆందోళనకర పరిస్థితులున్నా.. హైదరాబాద్‌సహా దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 2022తో పోల్చితే 2023లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ 15 శాతం పెరిగి 59.6 మిలియన్ చదరపు అడుగులకు చేరినట్టు నైట్ ఫ్రాంక్ వివరించింది. 2019 (60.6 మిలియన్ చదరపు అడుగులు)లో గరిష్ఠంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగింది. ఆ తర్వాత ఇదే అత్యధికం కావడం విశేషం.

**బెంగళూరు డౌన్**

గత ఏడాది బెంగళూరులో ఆఫీస్ స్పేస్ లీజింగ్ మందగించింది. 2023లో 12.5 మిలియన్ చదరపు అడుగులకే పరిమితమైంది. 2022తో పోల్చితే 14 శాతం తగ్గింది. ఇదే సమయంలో హైదరాబాద్‌లో 32 శాతం వృద్ధి కనిపించడం గమనార్హం. ఇక్కడ 8.8 మిలియన్ చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగిందని నైట్ ఫ్రాంక్ తెలియజేసింది. మొత్తంగా చూసినట్టైతే నిరుడు బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ పడిపోగా.. చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణెల్లో పెరిగింది.

**జీసీసీల హవా..**

దేశీయ ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో జీసీసీల హవా స్పష్టంగా కనిపిస్తున్నది. 2023లో 20.8 మిలియన్ చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని జీసీసీలు తీసుకున్నాయి. 2022తో పోల్చితే 58 శాతం పెరగడం గమనార్హం. చెన్నై తర్వాత హైదరాబాద్ ఆఫీస్ స్పేస్‌పైనే జీసీసీ కంపెనీలు మక్కువ చూపాయని నైట్ ఫ్రాంక్ ఇండియా డైరెక్టర్ జోసెఫ్ తిలక్ తెలిపారు. హైదరాబాద్‌లో అత్యుత్తమ జీవనశైలి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రతిభ, నైపుణ్యం కలిగిన యువత ఉండటం కార్పొరేట్లకు కలిసొస్తున్నది. అదీగాక దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ ఉన్నది. ఈ క్రమంలోనే అద్దెలు ఎలా ఉన్నా డిమాండ్ మాత్రం తగ్గడం లేదు.

**32,880 గృహాల విక్రయాలు**

గత ఏడాది కాలంలో హైదరాబాద్‌లో 32,880 యూనిట్ల ఇండ్లు అమ్ముడయ్యాయని నైట్ ఫ్రాంక్ తెలిపింది. ఇందులో మధ్య తరగతి ఇండ్లు, సరసమైన ధరల్లో ఉండే గృహాల కంటే అధిక బడ్జెట్ కూడిన ఇండ్ల క్రయవిక్రయాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నది. గత ఏడాదితో పోల్చితే వృద్ధి 6 శాతంగా ఉండగా, ధరల పెరుగుదల మాత్రం 11 శాతంగా ఉందని జోసెఫ్ తిలక్ తెలిపారు. అదే సమయంలో నగరంలో నివాస గృహాల కొత్త ప్రాజెక్టులు ఏడాది కాలంలో 46,985 యూనిట్లు ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారు.

**2023లో ఆఫీస్ స్పేస్ లీజింగ్**

| నగరం | మిలియన్ చ.అ.ల్లో | వృద్ధి (%) |
|---|---|---|
| చెన్నై | 10.8 | 92 |
| హైదరాబాద్ | 8.8 | 32 |
| కోల్‌కతా | 1.4 | 20 |
| ముంబై | 7.4 | 16 |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 10.2 | 14 |
| పుణె | 6.7 | 9 |
| బెంగళూరు | 12.5 | -14 |
| అహ్మదాబాద్ | 1.8 | -15 |
| మొత్తం | 59.6 | 15 |

**నగరాలవారీగా జీసీసీ కంపెనీలు లీజుకు తీసుకున్న స్థలం**

(మిలియన్ చదరపు అడుగుల్లో)

| నగరం | 2022 | 2023 |
|---|---|---|
| చెన్నై | 2.2 | 6 |
| హైదరాబాద్ | 2.7 | 4.1 |
| బెంగళూరు | 3.6 | 3.8 |
| పుణె | 3.0 | 3.3 |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 0.7 | 2.6 |
| ముంబై | 0.3 | 0.7 |
| కోల్‌కతా | 0.2 | 0.2 |
| అహ్మదాబాద్ | 0.3 | 0.1 |
| మొత్తం | 13 | 20.8 |

## బీవోఎం గృహ వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 3: నూతన సంవత్సరంలో గృహ రుణాలు తీసుకునేవారికి ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీరేటును 15 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో రుణ రేటు 8.50 శాతం నుంచి 8.35 శాతానికి దిగిరానున్నది. వీటితోపాటు గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును సైతం ఎత్తివేసింది బ్యాంక్. గృహాలు కొనుగోలు చేసేవారికి రెండు రకాలుగా ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలో భాగంగా వడ్డీరేట్లను తగ్గించడం, ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా ఎత్తివేసినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

## రెడ్డీస్ చేతికి మెనోల్యాబ్స్

హైదరాబాద్, జనవరి 3: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరిస్..అమెరికాలో మహిళా ఆరోగ్య, ఆహార సంబంధమైన ఔషధాల బయోటెక్నాలజీ సంస్థ మెనోల్యాబ్స్‌ను కొనుగోలు చేసింది. దీంతో మెనోల్యాబ్స్‌కు చెందిన ఏడు బ్రాండెడ్ ఔషధాలు రెడ్డీస్ పరిధిలోకి రానున్నాయి.

## మారుతికి 174 కోట్ల నోటీసు

న్యూఢిల్లీ, జనవరి 3: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీకి జీఎస్టీ కౌన్సిల్ షాకిచ్చింది. గుజరాత్ జీఎస్టీ ఆథార్టీ రూ.173.9 కోట్ల పన్ను డిమాండ్ నోటీసును జారీ చేసింది. ఈ నోటీసుపై సంస్థ అప్పిలేట్ ఆథార్టీకి వెళ్లనున్నట్లు ప్రకటించింది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.